శ్రీ వేంకటేశ్వర-సదాశివేశ్వర

[illegible]యు ద్వయము.

13614

కనమలూరు. వేంకటసుబ్బయ్య.

శ్రీ వేంకటేశ్వర - సదాశివేశ్వర

గేయద్వయము.

★

కృతికర్త:

కనమలూరు వేంకటసుబ్బయ్య,

అప్పళాయగుంట.

13614

అన్నిహక్కులు గ్రంధకర్తవి.

వెల రు. 0—8—0

విజ్ఞాపనము

ఆశ్రితవత్సలుండగు శేషాచలాధీశు శ్రీవేంకటేశుఁ బెక్కుమార్లు సందర్శించుచుంటి నా దేవాదిదేవునిపై నేర్పడిన భక్తిభావమే యీ వేంకటేశ్వర గేయశతకరూపము. ఉభయసాధకముగ దీనిం దయారించియుంటిని.

అంతకుమున్నే మాయిలువేల్పగు శ్రీసదాశివేశ్వరు ననుదినముఁ బ్రార్థింప ననువుగ "ముక్తిపదగ్రస్త సదాశివము ద్రావళి" యను పేర నేబది గేయముల రచించియుండుటయేగాక సుహృన్మిత్రసమితిచే నిందు బలితంపించుచుంటి. ఈ రచనాద్వయము గ్రంథాకృతిం బొందినయెడల మదీయములగు నితర రచనలుగూడ సత్వరము రూపొందు భగవంతుఁ డనుగ్రహించునని విశ్వసించుచున్నాఁడ.

భక్తులీగేయద్వయము ననుదినము బఠించిన బరమాత్ము ననుగ్రహంబునకుం బాత్రులగుదురు. పాఠకులు హంసక్షీరన్యాయంబున మత్కృతిని మన్నింపం బ్రార్థనము. తమయభిప్రాయంబుల వ్రాసియిచ్చిన పండితవరేణ్యులయెడ నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

కనమలూరు-వేంకటసుబ్బయ్య,
గ్రంథకర్త.

అప్పళాయగుంట.
29-7-49.

అభిప్రాయములు

శ్రీకనుపులూరి వేంకటసుబ్బయ్యగారు రచించిన శ్రీవేంకటేశ్వర గేయశతకము, ముక్తపదగ్రస్త సదాశివముక్తావళి యనుభక్తిరసపూర్ణము లగు నీరచనముల రెంటిని నేకసంపుటమున ముద్రించిన వీని నామూలాగ్రముగ బఠించితిని. శైలిసరళమై నిర్దుష్టమై పఠనపాఠనయోగ్యమై నడచినది.

శ్రీవేంకటేశస్తుతి, వెనువెంటనే సదాశివస్తుతి గ్రంథకర్త సర్వాంతర్యామి యగుభగవంతుని హరిహరాత్మకమైన యేకైకశక్తిగా భావించుటను వెల్లడించుచున్నది. ఈకృతిపండితపామరుల కందఱకును సుప్రభాతము వోలికె ప్రాతస్స్మరణమునకు మిక్కిలి యోగ్యముగనున్నది.

వయోధికులగు గ్రంథకర్తగారి యెడ నిట్టిరచన మిక్కిలియోగ్యమై వారియైహిక విషయవైముఖ్యమును, పారమార్థికదృష్టిపథమును వేనోళ్ళ జాటుచున్నది. వారుభావించిన హరిహరులు వారికి దీర్ఘాయురారోగ్య విభవముల నొసంగి పాలింతురుగాత.

ఇట్లు సుహృద్విధేయ

తిరుపతి
15-7-49

జె. చెన్నారెడ్డి. ఎమ్. ఏ., బి.ఇడి.,
ప్రధానాంధ్రోపన్యాసకుడు. శ్రీవేంకటేశ్వర కళాశాల.

అయిదుమాత్రలగణములు రెండు, నొకగురువు తొలిచరణము, మరలనయిదుమాత్రలగణములు రెండు నొకగురువు. రెండవచరణము రెండింటినడుమ నుసిగా నయిదుమాత్రల గణమొకటి యుండునట్లు నాలుగు చరణములు గల గేయ రచనలు, నారాయణా, రామారామా, యని మకుటములుగలవి భక్తివేదాంతమయ శతకములుగాఁ బ్రజాసామాన్యమున నందు మరిరాయలసీమలోఁ బ్రచారము గలిగియున్నవి. ఆరెంటిలో నారాయణశతకము కొంత ప్రాచీనముగా వచ్చును నాకునారాయణశతకము పసితనమున నాలుకపైని నాట్యమాడుచుండెడిది. ఇదిచక్కని భావములు గలది.

శ్రీకనమలూరు వేంకటసుబ్బయ్యగారు 'వేంకటేశ' యనుమకుటముతో రచించిన యీశతకముపై ఫణితి ననువర్తించిన దగుటచే సులభసుందరముగా నున్నది.

స్వయముత్తీర్ణుఁడై రచయిత దీనినిరచియించినచో నారాయణశతకాదులవలె నిదియును బ్రజాసామాన్యమున బహుళ ప్రచారమును బడయగలదు. "స్వయంతీర్ణః పరాంస్తారయతి" యనిగదా. ఏతద్రచయిత యిట్టివాఁడని, కాననేతద్రచనము సప్రయోజనమని విశ్వసించుచున్నాను

వ్యాకరణ చక్షుత్త్వముతో నిట్టిరచనములో భాషాదోషములను ద్రవ్వియెత్తుటకై బ్రయత్నించుట తగనిపని. చూచినంతలో నిదితేటగా తియ్యగానున్నది.

తిరుపతి
24-7-49.

వే. ప్రభాకరశాస్త్రి.

కృతజ్ఞత.

క॥ చిత్తజజనకుని భక్తుం
డుత్తమ చారిత్రుఁ డనఘుఁ డురుగుణఖని పే
రెత్తిన చెయి సుజనులలోఁ
గొత్తపు సామన్న శెట్టిఁ గొనియాడఁదగున్.

చ॥ చదివితినొక్క భారతని సన్నిధి నీంచనద్వయంబుఁదా
మదిముదమంది ముద్రణకు మన్ననద్రవ్యమునిచ్చె నీగతిన్
గొదుకక ప్రోత్సహించు రసికుల్ గలరేనియు గ్రంధజాలముల్
గొదువలె యీవదాన్యునధికుం గణించుత దైవమెల్లెడన్.

సీ॥ కొలిచినయంతనే కొంగుబంగారమై
వేంకటేశ్వరుఁడు నీవెంటనుండు
తలచినయంతనే ధనధాన్యములఁ గూర్చి
శ్రీనివాసుండు నిన్ జేరియుండు.
పిలిచినయంతనే ప్రేమంపు మిత్రుఁడై
పద్మాక్షుఁ డెపుడు నిన్ బాయకుండు.
వలచినయంతనే వాంఛితార్థమ్ములఁ
గుంజరవరదుండు గూర్చుచుండు.

గీ॥ సజ్జనస్తవనీయ! నీజన్మసఫల
మగునుగావుత! నీకీర్తి జగమునందు
శాశ్వతంబగుఁగాత! విశాలహృదయుఁ
డైననీకేమి కొఱఁత సామన్నశెట్టి.

గురువందనము :

శ్రీరామానుజదాసవర్య సుకవి
శ్రేష్ఠా! గురూత్తంస నీ
కారుణ్యంబునఁ గైతలల్లి పరముం
గాంక్షించి సర్వేశునే
నారాధించి సమర్పణం బిటులఁ జే
యన్నెంచితిన్ సర్వదా
సారంబౌ రచనావిశేషత నవ
శ్యం బియ్యవే మ్రొక్కెదన్.

సమర్పణము:

సకల చరాచర జీవాత్మక స్వరూపుఁడు.

జగన్నాటక సూత్రధారి,

దివ్యతేజోమయ మూర్తి,

అగు

అద్వైత పరబ్రహ్మమునకు.

శ్రీ

క॥ శ్రీవేంకటాద్రి నిలయుని
భావంబున నిలిపి ముక్తి వడయుటకై త
ద్దేవాదిదేవు కృప నీ
పావనమౌ శతక మేను భక్తి రచింతున్.

శ్రీ వేంకటేశ్వరగేయ శతకము.

శ్రీమించు పద్మావతీ హృదయ సర
సిజ మత్త వరబంభరా
కామితార్థముల నిచ్చి నను బ్రోవు
కరుణతో వేంకటేశా! 1

ఘోర సంసారజలధిన్ దరిగాన
నేరకను దిరిగి తిరిగి!
సారమౌ నీనామమే నావయని
స్మరియింతు వేంకటేశా! 2

దేవదేవుని సృష్టిలోఁ జరియించు
జీవరాసుల యందున
భావింప నరజన్మమే శ్రేష్ఠమని
పల్కుదురు వేంకటేశా ! 3

ధర మనుజ రూపమెత్తి నినుభక్తి
దర్శింపలేని నరుఁడు
పరికింపఁ బాదయుగళిన్ దిరుగాడు
పశువుఁగద వేంకటేశా ! 4

కాయకష్టముల కోర్చి నీవున్న
గరుడాద్రి పై నెక్కిన
ధీయుతులై పుణ్యాత్ములు వటపత్ర
శాయి శ్రీ వేంకటేశా ! 5

పర్వతారోహణంబుఁ జేయుచును
బడలి మార్గమున శ్రమల
నిర్వహింప నశక్యమై నిన్మదిని
నిల్పుదురు వేంకటేశా ! 6

ధాత్రిలో జనులందఱు నినుఁజూడ
రాత్రులుం బవళులనక
స్తోత్రంబులన్ జేయుచు నేతెంత్రు
సొక్కుచును వేంకటేశా ! 7

భక్తాళికిన్ మార్గమున్ జూపుగతి
ప్రబలి విద్యుద్దీపముల్
మౌక్తికంబులఁ బోలుచు వెలుఁగు నీ
మహిమతో వేంకటేశా ! 8

సౌదామనీ శక్తిచే వెలుగొందు
స్తంభములు చూపించు నీ
పాద సన్నిధికిఁ బోవు మార్గమును
భటుల గతి వేంకటేశా ! 9

ఉడుగణంబులు భక్తిచే నినుఁగొల్వ
వ్యోమంబు వాసి వరుసన్
పుడమిపయి సలిపె ననఁగా దీపములు
పొలు పొందు వేంకటేశా ! 10

ప్రథమ గోపురమునందు నున్న నీ
పాదరక్షలఁ గాంచిన
అధికమౌ నానందము భక్తులకు
నగును శ్రీ వేంకటేశా ! 11

సోపానముల నెక్కఁగన్ దేహమ్ము
సొమ్మసిల శక్తిలేక
కాపాడుమంచు నిన్నుఁ దలఁచెదరు
కాంక్షతో వేంకటేశా ! 12

దేశ దేశముల నున్న భక్తులిలు
తీర్థమును ప్రార్థనలతో
ఆశలను విడుచు కొఱకు నినుఁజూడ
నరుదెంత్రు వేంకటేశా! 13

కష్టములు గలుగు నపుడు ముడుపులను
గట్టుకొని నీసన్నిధిఁ
ఇష్టార్థసిద్ధులొంది చెల్లింతు
రెవ్వరును వేంకటేశా! 14

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ
జీవస్వరూప శౌరి
భూమ్యాంతరిక్షములకు నాధార
భూతుఁడవు వేంకటేశా! 15

పుట్టలోపల పురుషుఁడై జనియించి
భువిని జరియించు చుండ
దిట్టఁడై గొల్లఁడొకఁడు నడునెత్తి
గొట్టె నిను వేంకటేశా! 16

రమణి శ్రీయాదిలక్ష్మి యాకాశ
రాజు గర్భమునఁ బుట్టఁ
దమిమీరఁ బెండ్లియాడ వలెనంచుఁ
దలఁచితివి వేంకటేశా! 17

వేటకై యడవిఁ దిరిగి వేసారి
వెలఁది పద్మజను జూచి
నీటుమాటల నాడఁగా రాళ్లతో
నినుఁ గొట్టె వేంకటేశా! 18

అకలంక చిత్తుఁడయ్యుఁ దల్లియా
వకుళమాలికను జేరి
సకలంబుఁ జెప్పివుచ్చి పరిణయో
త్సుకుఁడైతి వేంకటేశా! 19

కన్నెకై వకుళమాలఁ బంపితివొ
కలసాని వేషమూని
మున్నేగి సోదెచెప్పి యొప్పించి
మురియవే వేంకటేశా 20

చతురానాది దేవ బృందముల
మతిలోనఁ దలఁచినంత
సతులతో వచ్చిరపుడు నీపెండ్లి
జరిగింప వేంకటేశా! 21

గరుడ గంధర్వాదులు కిన్నరులు
క్రతుభుజుల్ విద్యాధరుల్
వరతపోధనులు మునులు తిరుమలకు
వచ్చిరటు వేంకటేశా! 22

అష్టదిక్పాలకులును సూర్యచం
ద్రాదిగ్రహములు నుడులు
ఇష్టార్థసిద్ధి నొందఁగ జనుదెంచి
రెలమితో వేంకటేశా ! 23

వైవాహిక క్రియలను సకలమ్ము
వైదగ్ధ్యమున నొప్పఁగాఁ
గావింపుఁడని సురలకుఁ జెప్పితివి
కంజాక్ష వేంకటేశా ! 24

సిరిని దాల్చిన వాఁడవు చేతనొక
చిల్లిగవ్వయు లేదని
పరిణయమ్మునకు ఋణము చేసితివి
పరమాత్మ వేంకటేశా ! 25

ధాత నిర్మించినట్టి లగ్నమునఁ
దరుణియా పద్మావతిఁ
బ్రీతితోఁ బెండ్లియాడి వెలసితివి
ఖ్యాతి శ్రీవేంకటేశా ! 26

తలలు బోడులు చేసిన మొదలోనఁ
దులసి మాలలు దాల్చిన
తలపులను బోడిచేయ వేలనీ
దాసులకు వేంకటేశా ! 27

ఋణవిముక్తులఁ జేసియు నినుఁగొల్చు
ఘనుల నోముదు వెప్పుడు
ఋణవిముక్తుఁడవు గాక లోఁగెదవు
ధనదునకు వేంకటేశా ! 28

పుష్కరిణి లోనఁ గ్రుంకి యటనున్న
భూ వరాహస్వామిని
నిష్కల్మషాత్ములగుచు దర్శింత్రు
నియమమున వేంకటేశా ! 29

కాశి గంగాజలమున వేమార్లు
కడుభక్తి గ్రుంకు ఫలము
శ్రీశ ! నీపుష్కరిణిలో గ్రుంకులిడ
చేకూరు వేంకటేశా ! 30

గోగర్భమున మునింగి పూర్వకృత
ఘోరపాపముల వీడి
యోగివర్యులను గూడి మహిమతో
నొప్పుదురు వేంకటేశా ! 31

ఆకాశ తీర్థమందు స్నానాల
నాచరించిన పురుషులు
ఏ కొఱంతయును లేక భోగాల
నెనఁగుదురు వేంకటేశా ! 32

పాపనాశన తీర్థమం దునమునుఁగఁ
బాపాత్ముఁడే యైనను
శ్రీపతీ ! నీభక్తుఁడై ముక్తుఁడౌ
సిద్ధమిది వేంకటేశా ! 83

కపిలతీర్థంబులోన స్నానంబు
గావించి కపిలేశ్వరుఁ
చపల చిత్తములు లేక దర్శింత్రు
సద్గుణులు వేంకటేశా ! 84

మాధవుండను బాఁపఁడు కామియై
మాదిగను బొంది చెడి నీ
భూధరము నెక్కి శుచియై పాపములఁ
బోఁదోలె వేంకటేశా ! 85

నీల నీరద శరీరా ! గోవింద !
నిగమగోచర ! శ్రీధరా !
నీలగళవినుత ! రారా ! నాయందు
నెనరుంచి వేంకటేశా ! 86

కాపాడు మనివేడిన ఇభరాజు
కష్టములఁ దొలఁగించియు
పాపిష్ఠియా మకరిని జంపితివి
పగవీర వేంకటేశా ! 87

మార్గమున సోపానముల్ అడుగడుగు
మండపంబు లనేకముల్
స్వర్గవాసుల కై నను చూడనా
శ్చర్యమగు వేంకటేశా ! 38

అడుగడుగు దండాలతో దేవాల
యమునఁ బ్రదక్షిణములఁ
కడు భక్తిఁ జేసి నిన్నుఁ జూచెదరు
గాంక్షతో వేంకటేశా ! 39

విసపుపా లొసఁగుటకును కపటియై
వేరాగ పురిటింటను
కనమాలపురఁ దక్కసిఁ జంపితివి
కసిదీర వేంకటేశా ! 40

శకటాసుర ధ్వంసకా ! హరిహరీ !
శరణు శరణు రమాధవా !
అకలంక సచ్చరిత్ర ! గోవింద !
సకలాత్మ ! వేంకటేశా ! 41

పరిపూర్ణ తేజోమయా ! కేశవా !
భక్తజన సంరక్షకా !
నిరుపమానంద రూపా ! వైకుంఠ
నిలయ ! శ్రీవేంకటేశా ! 42

ధేనుకాసుర భంజనా! మణిఖచిత
దివ్యాభరణ భూషణా!
సనకాది మునిపోషణా! వందనము
సర్వేశ! వేంకటేశా! 43

పాల్కడలి వటపత్రమే పాన్పుగాఁ
బవళించి యోగనిద్రఁ
మేల్కని ప్రపంచమందు నీవయి
మెలఁగితివి వేంకటేశా! 44

వీనులందున బుట్టిన మధుదైత్య
వీరుఁగైటభుఁ ద్రుంచియు
దాన భూమిని గిరులను సృష్టించు
ధన్యుఁడవు వేంకటేశా! 45

నీనాభి కమలమందు జనియించి
నిన్వేడుకొన్న బ్రహ్మ
నానా ప్రపంచసృష్టిఁ జేసెనీ
యానతో వేంకటేశా! 46

దీనజన చింతామణీ! రవికోటి
తేజ! నిష్కల్మష ఘృణీ!
మానిచిత్తాబ్జ తరణీ! యదువంశ
మణి! సగుణి! వేంకటేశా! 47

పిడికెఁడటుకు లొసంగిన విప్రునకు
ప్రియముతో సంపదలను
తడబాటు లేకొసంగి బంపితివి
ధన్యతను వేంకటేశా ! 48

తల్లి కోపించి రోటం గట్టఁగాఁ
తరలి యమళార్జునముల
ముల్లోకములు మెచ్చఁగా భంజించి
మురియవే వేంకటేశా ! 49

వల్లవుల మందిరములఁ జేరియు
వ్వారిగాఁ బాలువెన్నల్
కొల్లగా మెసవినట్టి గోపాల
వల్లభా ! వేంకటేశా ! 50

ఈరేడు జగములందుఁ బ్రోచువా
రెవ్వరయ్యా! నీకవినా
కారుణ్య సంధాయకా ! వేరుగతి
గాన శ్రీవేంకటేశా ! 51

మారారి వినుత నామా ! రిపుభీమ !
ఘోరాఘగణ విరామ !
శ్రీరమారమణీ కామా ! నన్నేలు
ప్రేమ శ్రీవేంకటేశా ! 52

భవబంధ లతలఁ ద్రుంప నీభక్తి
ధ్రువమైన ఖడ్గ మరయ
ప్రవిమలాకార శ్రీశా! పవమాన
భవ వినుత! వేంకటేశా! 53

గోవర్ధనాచలమును గొడుగుగాఁ
గొనగోటఁ బట్టినట్టి
భావనాతీత నిన్ను విడువనో
పరమేశ! వేంకటేశా! 54

మునిపత్ను లర్పించిన యోగిరముఁ
దిని సంతసించినట్టి
కనకవసనా! గొల్చెదన్ నీపాద
కంజముల వేంకటేశా! 55

కాళీయు ఫణమునెక్కి నాట్యమును
గావించి గర్వమడఁచి
బాళి దీరఁగ భక్తులన్ మనిపితివి
పరమాత్మ! వేంకటేశా! 56

ఎంత ద్రవ్యంబిచ్చిన బ్రోవుమం
చెన్నాళ్లు ప్రార్థించిన
నుంతైనఁ గరుణ రాదే మనుదునిది
చోద్యంబు వేంకటేశా! 57

ఎన్నాళ్లు పలుకకున్న నిన్వదల
కున్న నావంటిజనులన్
కన్నెత్తి చూడవేమి ? పూర్వకృత
కర్మమా వేంకటేశా ! 58

నిలువుదోపు లొసంగుచు నీపాద
జలజములసేవింపుచుఁ
బలుమారు వేడుచున్న నొకమారుఁ
బలుకవే వేంకటేశా ! 59

ఎందఱందఱిఁ బ్రోచితో యింకనిం
కెందఱిన్ బ్రోవఁగలవో
మంటుఁడా నన్నొక్కని రక్షింప
సందియము వేంకటేశా ! 60

శ్రీమందిరాంగణమున నివసించు
నిర్మలుల సేవించిన
భూమండలిన్ వృద్ధిగా యశముతోఁ
బొలుచుదురు వేంంటేశా ! 61

వడ్డికాసుల దేవుఁడా ! నను బ్రోవ
జడ్డుఁదనమది యేలరా ?
దొడ్డ దొరవని పట్టితి నీయడుగుఁ
దోయి శ్రీవేంకటేశా ! 62

గోవింద గోవిందయం చనుదినముఁ
గోరి నీయాలయమున
సేవించు వారి కొక్క మాటయేఁ
జెప్పవే వేంకటేశా ! 63

గరుడాద్రి యంజనాద్రి శేషాద్రి
కనకాద్రి వేంకటాద్రి
పరగు వృషభాద్రి యంచు దలఁతురి
ప్పర్వతము వేంకటేశా ! 64

పామరుల నేత్రములకీ శైలంబు
పాషాణమై దోచును
కామరహితుల కెల్లను గనకమై
గన్పట్టు వేంకటేశా ! 65

దిన, పక్ష, మాసోత్సవం బులుమరియు
దివ్యమౌ బ్రహ్మోత్సవాల్
గనెడు భాగ్యంబబ్బిన మూర్ఖుఁడే
యనఘుఁడౌ వేంకటేశా ! 66

సచరాచరంబులకును గర్తవే
సలలితాంభోజనేత్ర !
అచలాధిపస్తుత్య ! నను గరుణింపు
మచ్యుతా ! వేంకటేశా ! 67

క్రూరుఁడౌ కంసునాజ్ఞన్ మందకును
గోరిరా నక్రూరునిన్
గౌరవించిన యదుకులో ద్ధరణ ! హరి !
శ్రీరమణ ! వేంకటేశా ! 68

కుబ్జయొసఁగిన గంధమున్ గైకొనుచుఁ
గోరి రతికేళి సల్పి
అబ్జాక్ష ! రూపవతిగాఁ జేసితివి
యద్భుతము వేంకటేశా ! 69

దారితాఖిల దుష్కృతా ! అచ్యుతా !
నీరజాసన వందితా !
సూరిజన భాగధేయ ! జగదేక
వీర శ్రీవేంకటేశా ! 70

ప్రత్యూషమున లేచియు నీసుప్ర
భాత పారాయణంబున్
నిత్యంబు సేయువారు దురితముల
నెట్టుదురు వేంకటేశా 71

విధి నేమఱచి శ్రుతులన్ దాచి నీ
రధి మునింగిన సోమకున్
వధియింప మత్స్యరూపం బెత్తితివి
వసుధేశ ! వేంకటేశా ! 72

గురు కూర్మరూప మెత్తి మందరము
చరమాంగమున ధరించి
శరధిపైఁ దేల్చినట్టి భోగీంద్ర
శయన ! శ్రీవేంకటేశా ! 73

దితిసుతు హిరణ్యాక్షునిఁ సంప్రాప్తి వై
హతము గావించి మించి
క్షితిభార ముడిపి ప్రీతి శేషాద్రి !
జేరితివి వేంకటేశా ! 74

బాలుఁడౌ ప్రహ్లాదుని గాచుటకు
లీల నరహరి రూపముఁ
దాలిచి హిరణ్యకశిపుఁ ద్రుంచితివి
దర్పమున వేంకటేశా ! 75

వడుగు రూపమున బలిని పుడమి మూఁ
డడుగు లిమ్మనుచు నడిగి
కడువడిగఁ బెరిగి కొలిచి సర్వమ్ముఁ
గై కొన్న వేంకటేశా ! 76

గండ్ర గొడ్డలి ధరించి క్షత్రియుల
గర్వమడఁపఁ దలంచి
తీండ్రముగ ముయ్యేడుమా ర్లనిలోవ
ధించితివి వేంకటేశా ! 77

కోసలాత్మజ గర్భమం దుదయించి
కుమతియౌ దశకంఠునిన్
వాసిమీఱఁగ ద్రుంచిన లోకైక
వంద్య ! శ్రీవేంకటేశా ! 78

బలరామ రూపమొంది ముసలమ్ము
హలము హస్తములఁబట్టి
తలచెదరఁగాఁ బ్రలంబున్ గొట్టవే
జలజాక్ష ! వేంకటేశా ! 79

బుద్ధరూపంబు నొంది దుర్మతుల
బుద్ధిహీనులఁ బ్రోవఁగా
శుద్ధ సత్యాహింసలన్ బోధించు
శుభద ! శ్రీవేంకటేశా ! 80

కల్కివై ధర్మమ్ములన్ బాలింప
ఖలుల గర్వమునణంప
నిల్కడగ గరుడాద్రియం దున్నావు
నిఖిలేశ వేంకటేశా ! 81

సకల రోగభయాదులన్ బోఁగొట్టు
సామివని భక్తవరులు
అకలంక ! నీకీర్తనల్ పాడుదు ర
హర్నిశలు వేంకటేశా ! 82

ఖలశిక్ష సాధురక్ష చేయంగ
కర్తవీవే యిద్ధరన్
నలలితాంభోజనేత్రా ! చేమోడ్తు
స్వామి ! శ్రీవేంకటేశా ! 83

ఎగ్గులెంచక బ్రోతువం చనుచుఁజే
యొగ్గి వేడుదు నీశ్వరా !
సిగ్గుగా నున్న దేమో ననుఁబ్రోవ
లగ్గగును వేంకటేశా ! 84

ఏమినేరముఁ జేసిన నీనామ
మేమూరఁ జక్రపాణి
కామితార్థమ్ము నిచ్చి కడతేర్చు
కంసారి ! వేంకటేశా ! 85

పరులఁ బ్రార్థించి విసిగి యెవ్వారుఁ
బాలింపరనుచు నిన్నె
శరణు జొచ్చితి, నమ్మితి నన్నేల
జాగేల వేంకటేశా ! 86

కనికరం బొక్కింతయు నాయందు
గలుగ దింకేమిసేతు
దినదినము నీస్మరణమే నాకొక్క
దిక్కు శ్రీవేంకటేశా ! 87

పాపములు సేయుచుంటి తుదకునీ
పాదములె శరణమంటి
చేపట్టి యేలకున్నఁ దీరదిఁక
శ్రీరమణ వేంకటేశా ! 88

శరణాగత త్రాణమే బిరుదుగా
కరమునను ధరియించిన
పరమపురుషా పట్టెదన్ నీపాద
పద్మములు వేంకటేశా ! 89

రఘుకులమునందు బుట్టి క్రూరులౌ
రాక్షసాధములఁగొట్టి
యఘవిదూరులను మునులఁ బ్రోచితివి
యచ్యుతా ! వేంకటేశా ! 90

ఇనతనయు సఖ్యమంది పవనాత్మ
జుని బంటుగా నేలుచు
వనచరుల సాహాయ్యతన్ ఉదధిబం
ధనచేయు వేంకటేశా ! 91

హనుమచే నుంగరంబు నిచ్చిజన
కాత్మజకు నీక్షేమమున్
వినిపించి సంతోషసా గరములో
ముంచితివి వేంకటేశా ! 93

పత్నిని చెఱగొనిపోయిన దైత్యునకు
హితము బోధించుటకున్
మతిమంతుఁడగు నంగదుఁ బంపితివి
మహనీయ వేంకటేశా ! 93

అని మొనన్ దశకంధరున్ జంపుటకు
మును విభీషణుని మెచ్చి
ఘనముగా లంకాధిప త్యంబు నొసఁ
గట్టితివి వేంకటేశా ! 94

రథ్యముల పగ్గములను జేపట్టి
రథచోదకుండవయ్యు
పార్థునకు గీతార్థమున్ బోధించి
ప్రబలితివి వేంకటేశా ! 95

కురుసేన నట్టెచూచి యర్జునుఁడు
గురులఁ గురువృద్ధజనులఁ
బరిమార్ప వెనుదీయఁగాఁ బురికొల్పి
పంపితివి వేంకటేశా ! 96

పంచభూతములు నీవే సర్వత్ర
పంచాత్మకుండ వీవే
పంచాననుండ వీవే త్రివిధరూ
పములీవె వేంకటేశా ! 97

కలియుగములోన నిన్ను దర్శింప

కలుషముల ఫలితములకు యమభటుల్
గాచింత్రు వేంకటేశా! 98

దాన ధర్మములు లేక ద్రవ్యమును
దాఁచినక చేర్చువాని
మానవుండని చెప్పఁగా వచ్చునే
మహిలోన వేంకటేశా! 99

సర్వభూతముల యందు దయయుంచు
సజ్జనులు నీభక్తులై
గర్వ విరహితులై నినుం గనుఁగొంద్రు
కమలాక్ష వేంకటేశా! 100

పరమ పూజ్యతను మించు నీచరిత
పద్య కావ్యముగ వ్రాసి
తరిగొండ వేంకమాంబ భువిలోన
ధన్యయయె వేంకటేశా! 101

భువి నీచరిత్రఁ బొగడ నయ్యాది
భోగి కాదనుచు నుండ
ప్రవిమలాకార! శౌరీ! నాకంత
ప్రజ్ఞయో వేంకటేశా! 102

చారు సద్గుణ గరిష్ఠుఁ రామాను
జార్యు మద్గురుని దలఁచి
నే రచించితి నీకృతిఁ గైకొమ్మ
నిగమనుత వేంకటేశా! 103

ధరణి నన్నృణ సరోవరం బనుపేరఁ
బరగు నప్పాలయుగుంటన్
వరశంఖపాలగోత్రో ద్భవుఁడ కరి
వరద శ్రీవేంకటేశా ! 104

నన్ను వేంకటసుబ్బయా ఖ్యనుబిలిచి
మన్నింత్రులోకులెల్ల
నిన్ను నమ్మితి బ్రోవవే శుభములన్
జెన్నార వేంకటేశా ! 105

రవిచంద్రతారకముగా నీసుకృతి
రంజిల్లి వర్ధిల్లగా
భవబాధములు వాయఁగాఁ దయఁజూడు
భక్తుఁడను వేంకటేశా ! 106

ఈకృతిని జదువ వినిన భక్తితో
నేరి కేన్వినిపించిన
ప్రాకృతులు నీపవిత్ర నిలయంబుఁ
బడయుదురు వేంకటేశా ! 107

మంగళము శ్రీనివాసా ! లోకైక
మంగళాకార శ్రీశా !
మంగళము భక్తవరద ! సర్వత్ర
మంగళము వేంకటేశా ! 108

శ్రీవేంకటేశ్వరగేయ శతకము

సమాప్తము.

శ్రీ

ఉ॥ శ్రీనగజా మనోహర ! వి
శిష్ట సురార్చిత పాదపంకజా !
నూనశరారి ! ఫల్గున య
శోధన శోధన ! లోకపావనా !
దీనజనార్తి భంజన ! సు
ధీవరపోష ! కృపావిశేష ! శ్రీ
జానిసఖా ! వృషధ్వజ ! భు
జంగవిభూష ! సదాశివేశ్వరా !

ముక్తపదగ్రస్త సదాశివ ముక్తావళి ప్రారంభము.

శ్రీభవాని హృదబ్జబంభర !
సేవితామర ! శంకరా !
ప్రాభవంబగు నీదుచరితము
భక్తిఁదలఁతు సదాశివా ! 1

భక్తిచే నీపదయుగంబుల
భజనచేసెడి వారికిన్
ముక్తిమార్గముఁ జూపితివిగదె
మోక్షదాత సదాశివా ! 2

మోక్షదాత వనుచు మృకండుని
ముద్దుఁ గుఱ్ఱఁడు వేఁడఁగా
నాక్షణంబునఁ జేరి బ్రోచిన
యసురనాశ ! సదాశివా ! 3

నాశరహిత ! భుజంగభూషణ
నవ్యసుందరవిగ్రహా !
ఈశ ! వరభూతేశ ! దురిత వి
నాశ ! గిరిశ ! సదాశివా ! 4

గిరిశుఁడని సురవరులు మొరలిడ
దురితములఁ దూలించి నీ
సురుచిరామృతదృష్టిఁ బ్రోచిన
శోభనాంగ సదాశివా ! 5

శోభనాంగుం డైనమదనుని
స్రుక్కఁజేసి తదంగమున్
రూపుమాపిన కాలభైరవ
ప్రాపునీవె సదాశివా ! 6

ప్రాపునీవని నిర్జరులు నిను
భజన చేసిన గరళమున్
ఏపుమీఱఁగ నారగించితి
వెందు ధారి సదాశివా ! 7

ఇందుమార్తాండాగ్ని నేత్ర సు
రేంద్రవంద్య శివంకరా !
వందనంబిదో నన్నుఁ బ్రోవుము
వామదేవ సదాశివా ! 8

దేవతారకమంత్రమును నీ
దేవికాత్యాయనికి ముక్తి
భావములరఁగఁ జెప్పి ప్రోచిన
భానుతేజ సదాశివా ! 9

భానుతేజుఁడ వనుచు నీపద
పంకజంబులె ప్రాపుగా
నూనిగొల్చిన బాణదైత్యుని
యొద్దనున్న సదాశివా ! 10

ఉన్నతంబగు నీదురూపముఁ
గన్నులారఁగఁ గాంచినన్
ఎన్నరాని పదంబు లొసఁగుదు
వెప్పుడైన సదాశివా ! 11

ఎప్పుడో యీదేహము న్విడి
చెప్పకేగును జీవుడున్
ఇప్పుడే నినుఁదలఁతు మోక్షం
బిచ్చిమనుపు సదాశివా ! 12

మనెడు కాలంబునను నీపద
మనన మెఱుఁగనిపాపినై
యనయమును యమబాధలకు లో
నగుట మేలె సదాశివా! 13

మేలొనంగని యాలుబిడ్డల
నాలఁగని కడుఁగాంక్షచే
నేల పుట్టుచుఁ గిట్టుచు నీ
లీల మిడుక సదాశివా! 14

మిడుకుచున్ వడి దుఃఖవారిధిఁ
బడుచు దారి నెఱుంగకన్
జడియ నేటికి నిన్నుఁ దలఁచెడు
సజ్జనుండు సదాశివా! 15

సజ్జనాగ్రణియైన మనుజుఁడు
సత్వగుణ సంపన్నుఁడై
ముజ్జగంబులఁ గీర్తిఁ గాంచి వి
మోహియౌను సదాశివా! 16

మోహమదమాత్సర్యములఁ గడు
మూఢులై నిన్నెఱుఁగకన్
సాహసంబున దుష్టకార్యము
సల్పుచుందురు సదాశివా! 17

నల్పుచుండెడి కార్యములలో
సాక్షినీవని యెంచినన్
అల్పకార్యము నేయు బుద్ధికి
నందకుండు సదాశివా! 18

అందరాని పదంబదేదో
యంచుజ్ఞానాంబకముచేఁ
గందురార్యులు నీదురూపముఁ
గన్నులార సదాశివా! 19

కన్నులున్నందునకు ఫలితముఁ
గాననీభువిలోన నా
వన్నరక్షణ చూపుమా నా
కున్నదారి సదాశివా! 20

దారి తెలియక మూఢమతులీ
తనువు శాశ్వతమంచు వే
ఘోరకృత్యంబైన హింసను
గోరుచుంద్రు సదాశివా! 21

కోరినీకాయంబు చేరువఁ
జేరి వేడిన కోరికిన్
పారమార్థిక దృష్టి నస్థ శ
రీరమీవె సదాశివా! 22

ఈవిమ్రాన్పులె భక్తకోటికి
నిష్టపడెదు ధనాదులన్
భావమలరఁగ నిచ్చి భిక్షా
పాత్రుఁడైన సదాశివా ! 23

పాత్రమని యాతమ్మిచూలి క
పాలముం జేఁదాల్చుచున్
ధాత్రినంతయు సంచరించిన
దానపోష సదాశివా ! 24

దానపోషణ బిరుదు కరములఁ
దాల్చి యా సిరియాళునిన్
ధానమాన నిలాసుఁ జేసిన
భద్రమూర్తి సదాశివా ! 25

భద్రమూర్తివటంచు నిర్మల
భావమున నిన్వేఁడుచున్
అద్రినెత్తిన పంక్తికంఠున
కభయమీవె సదాశివా ! 26

అభయమిచ్చి భయంబు మాన్పెడి
యాదిమూర్తివి నీవు ని
శుభకరంబగు మంగళాంగముఁ
జూపుమెపుడు సదాశివా ! 27

చూచుభాగ్యము గల్గువారలు
సురవరులు సరుసైన నిన్
జూచి ధన్యముఁ జూడనొల్లరు
సుందరాంగ సదాశివా ! 28

అంగజాంగహరా ! పినాకీ !
ఆదిభిక్షు ! మహేశ్వరా !
భంగరహిత ! భుజంగ ! రాజధృ
తాంగమహిత ! సదాశివా ! 29

హితమతిని గతినీవెయని ప్రా
ర్ణేందుధర నిన్వేడఁగా
పతితసంఘము లెల్లఁ దొలఁగును
భానుతేజ సదాశివా ! 30

తేజమున నా త్రిపురముల ని
స్తేజతను హరియింపవే
రాజరాజసఖా ! వినిర్మల
రాజమకుట సదాశివా ! 31

మకుట కేయూరాంగదంబులు
మాయయని యోచించినన్
అకుటిలాత్మకుఁడయ్యు నీపద
మర్థిఁజేరు సదాశివా ! 32

ముక్తపదగ్రస్త సదాశివ ముక్తావళి

అర్థినిను బ్రార్థించు మునివరు
లాగమాదుల పఠనముల్
వ్యర్థమని మది దలచు చుందురు
సార్థకముగ సదాశివా ! 33

సార్థకంబని సర్వమంగళ
కర్థదేహ మొసంగియున్
అర్థనారీశ్వరుడవైన శ
శాంకధారి సదాశివా ! 34

దారితాఖిలదుష్కృతా ! హిమ
ధామవాస ! శుభంకరా !
నీరజాసనవంద్య ! శంకర !
నిత్యభావ సదాశివా ! 35

భాషలెన్ని పఠించినను ముని
వేషములు ధరియించినన్
ఈషణత్రయ బద్ధులౌ నీ
యెఱుక గొఱత సదాశివా ! 36

ఎఱుక సర్వార్థంబనుచు ని
న్నెఱుగఁ గర్మేంద్రియముల
బరుగిడెడి మార్గావరోధము
బరయు నీవు సదాశివా ! 37

నీవు నే నను భేదమెంచక
నిర్మలాత్ముండైన యా
జీవి భువిలో జనన మరణముఁ
జెందకుండు సదాశివా ! 38

జనన మరణాదుల నెఱుంగక
జన్మ సాఫల్యంబునన్
తనరు చక్కజమైన బ్రహ్మ ప
దంబుఁ గాంచు సదాశివా ! 39

కాంచి యానందంబుచే ని
ష్కాముఁడై లోచూపునన్
మించి నీలో నైక్యభావముఁ
గాంచు సతము సదాశివా ! 40

సతము గాదని సుఖము దుఃఖము
సత్వగుణ సంపూర్ణతన్
పతితపావనుఁడైన నిన్ గన
భవము వాయు సదాశివా ! 41

భవసుఖంబుల మరగి నిరతము
భద్రమగు నీధ్యానమున్
ప్రవిమలంబుగఁ జేయ నొల్లరు
పాపమతులు సదాశివా ! 42

పాపమతులై భరతమాతకు
భారమగు దుష్కర్మముల్
సాపరాధులు గానిమాడ్కిని
సల్పమేలె సదాశివా ! 43

మేలుగలుగు నటంచు మునిజన
పాల భవ్యసుశీల నీ
లీలలం గనుగొన్న వారే
జాలిఁ బడరు సదాశివా ! 44

జాలిఁబడి యజ్ఞాన వారిధిఁ
గూలి లేవ నసాధ్యమై
సోలుచుండెదువారు నిను ధరఁ
జూడలేరు సదాశివా ! 45

జూడలేక భవత్పదాబ్జము
వ్రీడయును లేకెప్పుడున్
కీడుమూఁడెడు ధనముఁ జేర్తురు
మూఢమతులు సదాశివా ! 46

మతివిహీనతనొంది దుష్కర
మార్గమునఁ జరియించుచున్
అతివివేకులమంచు సుకృతపు
గతిఁ దలఁతురు సదాశివా ! 48

తలచి నిరోమహాత్మ్యమున నీ
దర్శనం బెదగోరెద
నలిన సంభవ వినుత గైకొను
నాదు మ్రొక్కు సదాశివా ! 48

మ్రొక్కులిడి నీనామ మహిమకు
మోదమందియు భక్తిచే
నక్కజంబుగ వ్రాసితిని నీ
దిక్కునమ్మి సదాశివా ! 49

దిక్కునీవ, అమృతసరోవర
దివ్యహార సాధువులచే
జిక్కి వేంకటసుబ్బయాఖ్యుని
జేరి బ్రోవు సదాశివా ! 50

శ్రీసదాశివ ముక్తావళి
సంపూర్ణము

గీ॥ భక్తి ముక్తపదగ్రస్త మౌక్తికముల
జేర్చి దామంబు గూర్చి యర్పించినాడ
కరుణధరియించి భక్తుల కామితముల
దీర్పుమయ్య ! సదాశివా ! దీనబంధు !

స వ ర ణ లు.

పుటు.	పంక్తి.	తప్పు.		ఒప్పు.
4	11	భూమ్యంతరిక్షములకు	....	భూమికిని గగనమునకు
5	14	మతిలోనc	....	వతిసంభc
9	6	యముసc	....	యమునc
20	1	వతిని	....	పతిని
21	3	దాస	....	దావ
2[illegible]	9	చంద్రతారకముగా	....	తేజముండువరకు.
24	12	శోభనాంగ	...	శుభదరూప
24	13	శోభనాంగుం	....	రూపవంతుం
24	15	రూపుమాపిన	....	బాసcజేసిన
29	9	పూ.	....	ఖం
29	10	ర్ణం	....	డేం
31	16	సదాశినా	....	సదాశివా
32	13	జూడ	....	చూడ
32	15	కీడుమూcడెడు	....	గోడుcగూర్చెడు
32	16	మూఢ	....	కుటిల